PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
All Insurances Cashless Available | 24/7 Emergency Services | Ambulance Services
+91 85230 89599  +91 86889 09384
Web: www.jaitrahospitals.com Mail: info@jaitrahospitals.com
Address: Beside ITI, NH 44, Chandra Nagar, Medchal, Telangana 501401.

విజయవాడ, హైదరాబాద్ | ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు | సంపుటి : 01 | సంచిక : 93 | గురువారం , జూలై 09 , 2026 , | పేజీలు - 8 | వెల : 3 /-

## ఎపిలో హాస్టల్,గురుకులాల
# మెస్ ఛార్జీల పెంపు

### - సంక్షేమ శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబు నిర్ణయం



**అమరావతి, జూలై 08:** హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీలను పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సంక్షేమ శాఖల మంత్రులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఛార్జీలపై 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని సీఎం పేర్కొన్నారు. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవనాలకు రూ.500 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హాస్టళ్లు, గురుకులాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మెస్ ఛార్జీల పెంపునపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

మిగతా2లో...



## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న
# లోకేశ్ పర్యటన

**హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో లోకేశ్ సమావేశం**

**కుప్పంలో ఫుట్‌వేర్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమకు ఓకే**

**అమరావతి, జూలై 08:** దక్షిణ కొరియా బుసాన్‌లో హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీలో హ్యోసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం పలికారు. కుప్పంలో

మిగతా2లో...



## ఎస్సీలను పావులుగా
# వాడుకుంటున్నారు

### - రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్

**విజయవాడ, జూలై 08:** రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు.

మిగతా2లో...

## తప్పుడు కూతలు కూసే వారికి
# ప్రజలే బుద్ధి చెప్పాలి

### - జోసెఫ్ రావణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ విజయసాయి



**అమరావతి, జూలై 08:** జోసెఫ్ రావణ్ వ్యవహారంపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు మద్దతు ఎవరిస్తున్నారని ప్రశ్నించారు.

మిగతా2లో...

# నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

### - ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు

2లో

## విజయమ్మతో కలిసి వైఎస్సార్‌కు
# జగన్ నివాళి..!!



**అమరావతి, జూలై 08:** మాజీ సీఎం జగన్ తన తండ్రి వైఎస్సార్ కు నివాళి అర్పించారు. వైఎస్సార్ జన్మదినం సందర్భం గా కుటుంబ సభ్యులతో కలిసి జగన్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. తల్లి విజయమ్మ.. భారతి సహా పలువురు పార్టీ నేతలు జగన్ తో కలిసి నివాళి అర్పించారు. వైఎస్సార్ తీసుకొచ్చిన సంస్కరణలు..అమలు చేసిన పథకాలను పార్టీ నేతలు ప్రస్తావించారు. జగన్ పులివెందులలో రెండో రోజు పర్యటన కొనసాగుతోంది.మాజీ సీఎం జగన్ ఇడుపులపాయలో

మిగతా2లో...

## చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు
# వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా..?
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో ఫైర్ అయిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, జూలై 08:** గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు.

మిగతా2లో...



## మతాల మధ్య
# చిచ్చు పెట్టే యత్నం

**హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు**

**వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం**

**మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్**

**అమరావతి, జూలై 08:** భారతీయులు, హిందువుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ

మిగతా2లో...

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై
# దుష్ప్రచారం

- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి
- బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ



**న్యూఢిల్లీ, జూలై 08:** ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు.బుధవారం) కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా నేతలు

మిగతా2లో...

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

**(మొదటి పేజీ తరువాయి)**

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతుగోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి ఈఅఎకి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. 2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఈఅఎకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారిం చారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఔఅఆఅ ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ- 2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేందప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఓ÷ూఖ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఓ÷ూఖ ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34891 కోట్లని తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

# నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

## ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ, జూలై 08:** నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్,



హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

# మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

**(మొదటి పేజీ తరువాయి)**

సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు.

రాజ్యాంగం ఇవ్వని భావ ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నా రని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శి ంచారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకిస్తు న్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసే లా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకు పడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**

సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు. మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే త్తటెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్ల కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు.

# దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

**(మొదటి పేజీ తరువాయి)**

ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ , మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు. ఏపీలో నెక్స్ట్‌జెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్‌అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కుప్పం కేంద్రంగా దక్షిణ భారత సమగ్ర ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన చేశారు. తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏపీలో టైర్-1, టైర్-2 వెండర్లతో సప్లయర్ మీట్ నిర్వహించాలని హ్వాసంగ్‌కు ఆహ్వానం పలికారు. కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్ - లెదర్ ఫుట్‌వేర్ ఎలాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా హ్వాసంగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని ప్రతినిధులు వివరించారు. అడిడాస్ సహా గ్లోబల్ బ్రాండ్లకు క్షఇఓ సరఫరాదారుగా హ్వాసంగ్ ఉండనుందని వెల్లడించారు. తొలి దశలో ఎగుమతులు.. ఆపై దేశీయ మార్కెట్‌పై దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో బూట్ల తయారీ ప్రక్రియను పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లతో తయారయ్యే షూస్‌పై ఆసక్తి కనపరిచారు. పాదాల ఆరోగ్యానికి ప్రత్యేక వైబ్రేషన్ చిప్ టెక్నాలజీని లోకేశ్ పరిశీలించారు. రక్తప్రసరణ మెరుగుదల, కండరాల అలసట తగ్గించే స్మార్ట్ ఫుట్‌వేర్ తయారీ గురించి ఆయన తెలుసుకున్నారు. 'పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో , ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ,ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశమయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. సింగిల్ విండో విధానంలో అనుమతులతోపాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించాను' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఎపిలో హాస్టల్,గురుకులాల మెస్ ఛార్జీల పెంపు

**(మొదటి పేజీ తరువాయి)**

మెస్ ఛార్జీల పెంపుతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించవచ్చని తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు సొంతిళ్లు మాదిరిగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**

సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగుతోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

# తప్పుడు కూతలు కూసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిద్దరు ఏ సంస్కృతికి వారసులు? అని నిలదీశారు. వారి తండ్రులు, తాతలు ఎవరు మూలాలు ఎక్కడ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తప్పుగా మాట్లాడిన వారికి చట్టం, సమాజం బుద్ధి చెప్పాలని విజయసాయి రెడ్డి హెచ్చరించారు. అలాంటివారికి యావజ్జీవం లేదా ఉరిశిక్ష వేసినా తప్పులేదని విజయసాయి రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అభ్యంతర వ్యాఖ్యలతో దాడి చేయడం ఫ్యాషన్ అయిపోయిందని విమర్శించారు. మతం మారిన కొన్ని కులాల్లోని కుటుంబాలు.. హిందుత్వంపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. జోసెఫ్ రావణ్, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ను వైసీపీ సమర్థించడ మంటే.. దేశంపై చేస్తున్న దాడిగానే పరిగణించాలని అన్నారు. దేశద్రోహ కుట్రలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని విజయసాయి రెడ్డి సూచించారు.

# విజయమ్మతో కలిసి వైఎస్సార్‌కు జగన్ నివాళి..!!

**(మొదటి పేజీ తరువాయి)**

తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ కు నివాళి అర్పించారు. వైఎస్సార్ 77వ జన్మదినం సందర్భంగా తల్లి విజయమ్మ, భారతి సహా పలువురు కుటుంబ సభ్యులు ఇడుపులపాయకు చేరుకున్నారు. రెండు రోజులుగా పులివెందులలో ఉన్న జగన్ ప్రజాదర్బార్ నిర్వహించారు. పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. టెట్ పరీక్ష పైన పలువురు ఉపాధ్యాయులు జగన్ ను కలిసారు. ఈ సమస్య పైన కేంద్రంతో చర్చిస్తామని జగన్ హామీ ఇచ్చారు. అవినాశ్ రెడ్డి సహా పార్టీ నేతలతో స్థానిక అంశాల పైన చర్చించారు. వారికి కీలక దిశా నిర్దేశం చేసారు. స్థానిక ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని.. కేడర్ మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక, ఈ రోజు ముఖ్య నేతలతో కలిసి ఇడుపులపాయకు వచ్చారు.తల్లి విజయమ్మ...కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన జగన్.. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. తల్లి విజయమ్మ సైతం ఇందులో పాల్గొన్నారు. జగన్ ను విజయమ్మ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. తరువాత ఇడుపులపాయలో ముఖ్యులతో జగన్ సమావేశమయ్యారు. పులివెందులతో సహా రాష్ట్రంలోని అంశాల పైన చర్చించారు. ఇక, వైఎస్సార్ జన్మదినాన్ని వైసీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పార్టీ ప్రధాన కార్యాలయంలోనూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వైఎస్సార్ జన్మదిన వేడుకలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

# కారుణ్య మరణాలకు మార్గం సుగమం

## - సుప్రీం మార్గదర్శకాలను ఆమోదించిన ఎపి ప్రభుత్వం

**అమరావతి, జూలై 08:** చివరి దశలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. మంత్రి సత్యకు మార్ యాదవ్ ఆమోదం తెలిపిన తాజా మార్గదర్శకాలతో కారుణ్య మరణాలకు సంబంధించిన విధానానికి చట్టబద్ధమైన రూపం లభించింది. ఈ నిర్ణయం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తీసుకున్న చర్యగా ప్రభుత్వం పేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, కోలుకునే అవకాశం లేని చివరి దశలో ఉన్న రోగుల విషయంలో నిర్దిష్ట నిబంధనలను అనుసరించి వైద్య బృందం, రోగి కుటుంబ సభ్యులు కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, వైద్య నిపుణుల అభిప్రాయాలు, రోగి హక్కులు అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఇలాంటి అంశాల్లో వైద్యులు, కుటుంబ సభ్యులు చట్టపరమైన సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొనేవారు. తాజా మార్గదర్శకాలతో నిర్ణయ ప్రక్రియకు స్పష్టత రావడంతో పాటు, చట్టబద్ధమైన రక్షణ కూడా లభించనుంది. దీనివల్ల వైద్య సేవల నిర్వహణలో పారదర్శకత పెరగడంతో పాటు అవసరంలేని న్యాయపరమైన ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు స్పందించే అవకాశాలు లేని రోగుల కుటుంబాలకు ఈ నిర్ణయం కొంత ఊరటనిచ్చే అవకాశముంది. అయితే ప్రతి కేసును నిర్దేశిత నిబంధనల ప్రకారం పరిశీలించి మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుతో ఆంధ్రప్రదేశ్‌లో కారుణ్య మరణాలపై స్పష్టమైన విధానం అమల్లోకి రానుంది.

# సంపాదకీయం



## కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా ?

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పదని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్ధంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.



# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు**

**అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు**

**బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు**

**టెహ్రాన్,జులై 8:** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది.హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికాతీవ్ర ఉల్లంఘనలకు పాల్పడు తోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు.ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దా డికి తామే బాధ్యులమనిఇరాన్‌ఇప్పటివరకు ప్రకటించలేదు.

# గల్లంతయిన మత్స్యకార కుటుంబాలకు భరోసా

**పదిలక్షల చొప్పన పరిహారం**

**అందించిన మంత్రి కొల్లు**

**గల్లంతయిన వారి జాడ తెలియక**

**కుటుంబాల్లో విషాదం**



**విశాఖపట్నం,జూలై8:** విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. బుధవారం మృతుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఐదు లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదు లక్షలను అందజేశారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మత్స్యకారుల కుటుంబాలకు అందించి నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా మత్స్యకారులకు ఇవ్వాల్సిన 63 క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టారన్నారు. రూ.3.15 కోట్లను కూడా ఈరోజు క్లియర్ చేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లతో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు. మరోవైపు మంత్రి రాకను మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా నిరసించాయి. తమవారిని రక్షించకుండా ఎందుకు వచ్చారని నిలదీశారు. ఇకపోతే సముద్ర జలాల్లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయంలో తమ వారి రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు. బోటు యజమాని కారి చిన్న సురక్షితంగా బయటకు వచ్చి తన కళ్ల ఎదుటే సహచరులు మునిగిపోయారని చెప్పడంతో వారిలో ఆందోళన మరింత తీవ్రమైంది. ఇంటి పెద్దల జాడ తెలియకపోవడంతో పిల్లలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కొందరు కడసారి చూపులకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ వచ్చిన సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని వారంతా కోరారు.చేపల రేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదంలో చిక్కుకున్న సమాచారాన్ని వారి కుటుంబసభ్యులు ఈ నెల 4న సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకార సంఘాల నేతలకు తెలియజేసినప్పటికీ ఆ విషయం మత్స్య శాఖ అధికారుల దృష్టికి రాత్రి 10.10 గంటల వరకు వెళ్లలేదు. ఈలోపు నష్టం జరిగిపోయింది. మత్స్యకారులు సమాచారమివ్వగానే అధికారులకు తెలియజేసి ఉంటే సెర్చింగ్ ఆపరేషన్ అదే రోజు సాయంత్రం ప్రారంభమయ్యేది. రాత్రి 9 గంటల వరకు బోల్తా పడిన బోటుపై సాయం కోసం మత్స్యకారులు ఎదురుచూశారు. పడవ మునిగిపోతుండటంతో సముద్ర జలాల్లో ఈత కొడుతూ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. తమకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి వస్తున్నామని సమాచారం వచ్చిందని.. 4 గంటల సమయంలో ప్రమాదంలో చిక్కుకున్నారని భావించి మత్స్యకార సంఘాల నాయకులకు తెలియజేసినట్లు మత్స్యకార మహిళలు చెప్పిన విషయాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మత్స్య శాఖ డీడీకి విషయం తెలియగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో కోస్టుగార్డును అప్రమత్తం చేశారు. నౌకలు కాకినాడలో ఉండటంతో ఆదివారం ఉదయం నుంచి గాలింపు చర్యలు మొదలయ్యాయి. మత్స్యకారులు సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులకు తెలియజేస్తే మెరుగైన ఫలితాలు ఉండేవని.. సమాచార లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# ఇప్పుడు అయోధ్య..గతంలో వారణాసి

**• దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు • హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు**



**వారణాసి,జూలై8:** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

# ఎన్ని కుట్రలు పన్నినా అనుకున్న సమయానికే అమరావతి పూర్తి



**అమరావతి, జులై 8:** అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ బుధవారం) సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఎల్పీఎస్ లే అవుట్ పనుల పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టుల వారీగా పనులు ఎంత మేరకు పూర్తయ్యాయనే దానిపై కాంట్రాక్ట్ సంస్థలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ 'మావిగన్' రాజకీయ ఎత్తుగడను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. మావిగన్ అంటే ఏ బస్సెక్కాలంటూ ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు పరిపాలన సులభతరం చేసేందుకు అన్ని వ్యవస్థలను ఓ చోటకు తీసుకొస్తే... అవగాహన లేకుండా మావిగన్ అంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా అనుకున్న సమయానికి అమరావతి తొలిదశ పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు.అమరావతి నిర్మాణాలపై గొడ్డలి పార్టీ పోలికలు పొంతన లేనివని మంత్రి మండిపడ్డారు. ఐకానిక్ భవనాలతో సాధారణ భవన నిర్మాణాల ఖర్చును పోల్చుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మావిగన్ జం అమరావతితో ఎన్నికలకు వెళ్తానంటున్న జగన్ మాటలకు వైసీపీ నేతలే ఛీ కొడుతున్నారన్నారు. దోమలు లేని నగరంగా అమరావతిని అభివృద్ధి చేసేందుకు భూగర్భ వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అమరావతిలో ఎమ్మెల్యే క్వార్టర్స్ పూర్తైనట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు ఎమ్మెల్సీ, ఏఐఎస్ టవర్లు పూర్తవుతాయన్నారు. పూర్తైన భవనాలను జీఏడీకి అప్పగిస్తున్నామని.. వారి నిబంధనలకు తగ్గట్టుగా కేటాయింపులు జరుగుతాయని వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశానికి అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలకృష్ణా రెడ్డి, ఇంజినీర్లు హాజరయ్యారు.

# సెర్చ్ ఆపరేషన్ ముగిసింది – బాధిత కుటుంబాల్లో తీరని వేదనను మిగిల్చింది



**విశాఖ జిల్లా:** విశాఖ తీరంలో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. తమ వారు తిరిగొస్తారని వేయి కళ్లతో ఎదురుచూసిన వారికి కన్నీరే మిగిలింది! గత నాలుగు రోజులుగా సాగిన ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ సంయుక్త రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది. 72 గంటలపాటు కొనసాగిన సెర్చ్ ఆపరేషన్‌ను ఇక ప్రయోజనం లేదని భావించి అధికారులు నిలిపివేశారు. అయితే బాధిత కుటుంబాల అభ్యర్థన మేరకు కోస్ట్‌గార్డ్ సహాయక చర్యలను బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు పొడిగించారు. అయినా దురదృష్టవశాత్తూ తప్పిపోయిన ఆరుగురు జాలర్ల ఆచూకీ మాత్రం లభించలేదు.దీంతో సెర్చ్ ఆపరేషన్ ముగిసిందని ఇవాళ అధికారులు ప్రకటించారు. మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకు వచ్చాయా అన్న కోణంలో తీర ప్రాంతంలో తనిఖీ చేయాలని గస్తీదళాలకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 72 గంటల గాలింపు పూర్తవగానే తక్షణ సాయం, పునరావాస చర్యలుంటాయి. మరోవైపు రూ.5 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీంకు అవసరమైన పత్రాలను మత్స్యశాఖ సిద్ధం చేస్తోంది.జులై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పులు, ప్రతికూల పరిస్థితుల కారణంగా జులై 4న వీరు ప్రయాణిస్తున్న బోటు ప్రమాదానికి గురై సముద్రంలో మునిగిపోయి ంది. ఈ ఘటనలో కారి చిన్న సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఆరుగురు జాలర్లు సముద్ర గర్భంలో గల్లంతయ్యారు. గాలింపు చర్యలు ముగిసినట్లు ప్రకటించడంతో మత్స్య కార గ్రామాల్లో తీరని ఆవేదన నెలకొంది.తమ వారు క్షేమంగా తిరిగి వస్తారని వెయ్యి కళ్లతో ఎదురుచూసిన గంగపుత్రుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. ఇంటి పెద్దల వస్తారని వెయ్యి కళ్లతో ఎదురుచూసిన ఆచూకీ లభించక పోవడంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కడసారి చూపులకు కూడా నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దృశ్యాలు స్థానికులను కంటతడి పెట్టిస్తున్నాయి. ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపది కన చర్యలు చేపట్టింది. గల్లంతైన ఒక్కో మత్స్యకారుడి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.మరోవైపు బాధిత మత్స్యకార కుటుంబాలను పరామర్శించేందుకు మత్స్యశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇవాళ విశాఖ చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను, బాధితుల దీనస్థితిని స్వయంగా పరిశీలించనున్న ఆయన, ప్రభుత్వం తరపున ఆయా కుటుంబాలకు భరోసా ఇవ్వనున్నారు. కాగా ప్రమాద తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు మరింత పరిహారం అందే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

# ఉగ్రలింకుల కేసు – విజయవాడలో మరోసారి ఎన్ఐఏ సోదాలు



**విజయవాడ:** ఆన్‌లైన్ టెర్రర్ రాడికలైజేషన్ నెట్‌వర్క్ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ వేగ వంతం చేసింది. తెల్లవారుజాము నుంచి విజయవాడలోని వించిపేట పరిసర ప్రాంతాల్లో ఎన్ఐఏ ముమ్మర సోదాలు జరుపుతోంది. ఈ ఏడాది మార్చి నెలలో విజయవాడలో అరెస్టైన ముగ్గురు ప్రధాన నిందితులకు ఎవరెవరితో సంబందాలున్నాయో తెలుసుకునేందుకు సోదాలు చేస్తున్నారు. నిందితుల ఇళ్లు గతంలో వారు సంచరించిన ప్రాంతాలలో డిజిటల్ ఆధారాలు, కమ్యూనికేషన్ డివైజ్?లు, ఆర్థిక లావాదేవీల పత్రాలను సేకరణపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. వించిపేట ప్రాంతంలో ఉగ్రవాద అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించడం వరుసగా ఇది మూడోసారిఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు: విజయవాడ వించిపేటకు చెందిన బైక్ డ్రైవర్ మహమ్మద్ రహ్మతుల్లా షరీఫ్ సోషల్ మీడియా వేదికల ద్వారా జిహాదీ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నట్లు గుర్తించి విజయవాడ టూ టౌన్ పోలీసులు ఈ ఏడాది మార్చి 22న అరెస్ట్ చేశారు. విచారణలో భవానిపురానికి చెందిన మహమ్మద్ డానిష్, మహంతిపురానికి చెందిన మీర్జా సోహైల్ బేగ్‌లతో కలిసి వీరు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు వేస్తున్నట్లు తేలింది. ఈ నెట్‌వర్క్‌పరిధి ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించి ఉండటంతో, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మే 13, ఎన్?ఐఏ విచారణ ప్రారంభించింది. విచారణ వేగవంతం: ఈ ముఠాకు కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, దిల్లీ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని మొత్తం 13 మంది నిందితులతో సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్? బేగం సహా ఇప్పటివరకు మొత్తం 12 మందిని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులంతా రాజమహేం ద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీలోకి తీసుకున్న అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు.నిందితులంతా 'అల్ మాలిక్ యూత్ ఇస్లామిక్ కమిటీ' – – పేరుతో సోషల్ మీడియా గ్రూపులను సృష్టించి, యువతను ఆకర్షించేందుకు , వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థల జిహాదీ వీడియోలను ప్రచారం చేసినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అల్–హకీమ్ శుకూర్ అనే విదేశీ హ్యాండ్లర్‌తో నిరంతరం కమ్యూనికేషన్‌లో ఉన్నట్లు, ఆన్‌లైన్‌లో పేలుడు పదార్థాల తయారీకి సంబంధించిన సమాచారాన్ని శోధించినట్లు డిజిటల్ ఆధారాలు లభించాయి.దేశద్రోహం: ప్రస్తుతం అరెస్టు అయిన నిందితులంతా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీలోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు, వారి అంతర్జాతీయ లింకులు, ఉగ్ర నిధుల లభ్యతపై విచారణను మరింత వేగవంతం చేశారు. నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంొేశద్రోహం కింద కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు వివరించారు.

# హిందుత్వ మూలాలను దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు



**విజయవాడ, జులై 8:** సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మండిపడ్డారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషా లు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవ న్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్ లు పంపుతూ విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపిం చారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్ర పూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకు పడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలున్నాయన్నారు.జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# మత విద్వేషాలను ప్రోత్సహిస్తున్నారు.



**అమరావతి, జులై 8 :** భారతీయులు, హిందు వుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావ ణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బ తీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించింది..ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# ఎల్‌నినో వేళ రైతులకు గుడ్‌న్యూస్ పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీరు



**కృష్ణా:**ఎల్‌నినో ప్రభావంతో సాగు ఆశలు సన్నగిల్లి దిగాలు పడిన కృష్ణాడెల్టా రైతులకు, ప్రభుత్వం తీపి కబురు అందించింది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడికాలువకు సాగునీరు విడుదల చేసింది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పట్టిసీమ వద్ద పూజలు చేసి పంపులు ఆన్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, కృష్ణా జలాలతో అనుస ంధానం చేసి నదుల అనుసంధానానికి ముఖ్య మంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు. 2014–19లో రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ, నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందన్నారు. ఎత్తిపోతల పథకాన్ని గొడ్డలి పార్టీ వట్టిసీమ అని విమర్శిం చిందని, ఇప్పుడు అదే పథకం ద్వారా ఇప్పటివరకు 450 టీఎంసీలు తరలించామని, దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.ఎల్?నినో వేళ రైతులకు నీటిని ఒడిసిపట్టి కృష్ణా డెల్టాకు : దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని పేర్కొన్నారు. పాలనా అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలు, ముందుచూపు లేకపోవడం వల్లే జగన్ పట్టిసీమ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కర్ణాటకలో ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు పాజెక్టులు డెడ్‌స్టోరేజీలో ఉన్నాయని, గోదావరికి ఎగువ నుంచి వస్తున్న నీరు సముద్రంలోకి పోకుండా ఒడిసిపట్టుకుని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలవరం, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు సిరి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి ధర్మరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి తదిరు తుల పాల్గొన్నారు."ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు ఉన్న కృష్ణానదిలో ఈ ఏడాది మొదటిసారి పట్టిసీమ నుంచి నీరు వస్తుంది. దీనికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్. ఇప్పటివరకు 450 టీఎంసీలు తరలించాం. గోదావరికి ఎగువ నుంచి వస్తున్న నీరు సముద్రంలోకి పోకుండా ఒడిసిపట్టుకుని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నాం. ఈ ఏడాది వర్షాభావం తక్కువగా నమోదు కావటం వల్ల, రైతులు కూడా తక్కువ నీటిని ఉపయోగించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి." – నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ మంత్రప్రయోజనం: శ్రీశైలం నుంచి కృష్ణా నదికి వరద వచ్చే వరకు ముందుగానే ఒడిసిపట్టి డెల్టాకు తరలిస్తారు. ఈ నీటి విడుదల ద్వారా కృష్ణా డెల్టా రైతులకు మొదటి ప్రాధాన్యతగా సాగునీరు అందనుంది. ఈ పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టా తూర్పు, పశ్చిమ కాలువల కింద ఉన్న దాదాపు 13 లక్షల ఎకరాలకు సాగునీరు మరియు తాగునీరు అందుతుంది.

# పోలవరం కొత్త డయాఫ్రం వాల్ నాణ్యత భేష్



**పోలవరం:**పోలవరం ప్రాజెక్టులో నిర్మించిన కొత్త డయా ఫ్రం వాల్ భేష్ అని విదేశీ నిపుణుల బృందం స్పష్టం చేసింది. తాము చేసిన పరీక్షల ఫలితా లన్నీ బాగున్నాయని ఏడో పర్యటన అనంతరం కేంద్ర జల్‌శక్తి శాఖ, జఔజలకు సమర్పించిన ప్రాథమిక నివేదికలో బృందం పేర్కొంది. అయితే తుది నివేదిక ఇంకా రావాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టులో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన కొత్త డయాఫ్రం వాల్ నాణ్యత భేషుగ్గా ఉందని విదేశీ నిపుణుల బృందం తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. పరీక్షల ఫలితాలన్నీ నిర్దేశిత ప్రమాణాలను అందుకున్నాయని, కొన్ని పరీక్షల ఫలితాలు ప్రమాణాలను మించి ఉన్నాయని తెలిపింది. వాల్‌ను నిర్మించిన బావర్ సంస్థ అందించిన సీఐఎస్ డేటా ఆధారంగా ప్యానెళ్ల మధ్య అతికింపు తదితరాలు నిర్దేశించిన పరిమితుల్లోనే ఉన్నట్లు 3డీ నమూనా పరిశీలనలో నిర్ధారణ అయిందని వెల్లడించింది. గతంలో ఆరుసార్లు ఆ బృందం వచ్చి పనులను పరిశీలించింది. బృంద సభ్యుడు హించ్‌బెర్గర్ మేలో మరోసారి మూడు రోజుల పాటు పోలవరంలో పర్యటించారు. పనులను పరిశీలించారు. తర్వాత దిల్లీలో కేంద్ర జలశక్తి, కేంద్ర జలసంఘం నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. పరిశీలనలు, నాణ్యత నియంత్రణ పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రాథమిక నివేదికను సమర్పించా రు. తుది నివేదిక రావాల్సి ఉంది.అన్ని రకాల పరీక్షల ఫలితాలూ సానుకూలంగా : ప్రాథమిక నివేదికలో పలు అంశాలను పేర్కొన్నారు. కొత్త డయాఫ్రం వాల్‌ను 1,372.6 మీటర్ల పొడవున 365 ప్యానెళ్లతో నిర్మించారని ప్యానెళ్ల సగటు లోతు 51 మీటర్లు. గరిష్ఠ లోతు 97.6 మీటర్లుగా ఉందని నివేదికలో తెలిపారు. 2025 జనవరి 18న పనులు ప్రారంభించి 2026 ఏప్రిల్ 2 నాటికి పూర్తి చేశారన్న నిపుణుల బృందం 7,311 యూసీఎస్, సీసీఎస్ పరీక్షలు నిర్వహించారని తెలిపింది. యూసీఎస్ అంటే వాల్ అడ్డంగా ఎంత ఒత్తిడిని తట్టుకోగలదు? అని పరీక్షించడం. డయాఫ్రం వాల్‌పై వేల టన్నుల మట్టి, నీటి ఒత్తిడి ఉంటుంది. పైనుంచి ముఖ్యం. సీసీఎస్ అంటే నాలుగు వైపులా ఒత్తిడి ఉంటే ఏమేరకు తట్టుకోగలదని నిర్ధారించే పరీక్ష. నీటిని డయాఫ్రం వాల్ ఎంతవరకు అడ్డుకుంటుందనే అంశాన్ని తేల్చేందుకు 841 పెర్మబిలిటీ పరీక్షలు, కాంక్రీటు తీరును తెలిపే స్లంప్ పరీక్షలు 23,607 చేశారని బృందం పేర్కొంది. అన్ని రకాల పరీక్షల ఫలితాలూ సానుకూలంగా ఉన్నాయంది.

# గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం



**విశాఖపట్నం, జులై 8:** విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. బుధవారం మృతుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఐదు లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదు లక్షలను అందజేశారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మత్స్యకారుల కుటుంబాలకు అందించినట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా మత్స్యకారులకు ఇవ్వాల్సిన 63 క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టారన్నారు. రూ.3.15 కోట్లను కూడా ఈరోజు క్లియర్ చేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్ట్మెంట్‌లతో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు.

PRGI NO: APTEL/26/A1204
కింగ్ డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper

# పవన్‌కల్యాణ్ అభిమాని నిరంజన్ మృతి - 'ఓజీ-2' చూద్దామనే కోరిక నెరవేరకుండానే మృత్యు ఒడిలోకి!



**హైదరాబాద్** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని అయిన హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) మృతి చెందారు. జన్యుపరమైన సమస్యల తె అరుదైన వ్యాధితో సతమతమవుతూ, ఎదుగుదల లోపించి మంచా నికే పరిమితమైన నిరంజన్‌ను గత నెలలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ పరామర్శి ంచారు. ఇటీవల అతడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో తల్లిదండ్రులు అతడికి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తీసుకువచ్చారు. హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి నిరం జన్ కన్నుమూశారు. మరోవైపు నిరంజన్ కుటుంబా నికి ప్రముఖ నటుడు సోనూసూద్ వీడియో కాల్ ద్వారా పరామర్శించారు.ఆ కోరిక తీరకుండానే : నిరంజన్‌ను కలిసినప్పుడు పవన్ కల్యాణ్ ఎంతో ఆత్మీయంగా హత్తుకుని బాలుడికి ధైర్యం చెప్పారు. అతడితో సెల్ఫీ తీసుకున్నారు. నిరంజ న్‌కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశా రు. 'తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని' నిరంజన్ పవన్‌కల్యా ణ్‌తో చెప్పగా 'కొని పంపిస్తా చిన్నా' అంటూ హామీ ఇచ్చారు. అలాగే 'ఓజీ-2' సినిమా తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్' అని, కలిసి సినిమా చూద్దామని పవన్ కల్యాణ్ ఇటీవల నిరంజన్‌ను కలిసిన సందర్భంగా చెప్పారు. ఈలోపే ఇంత విషాదం జరగడం పవన్ అభిమానులను తీవ్రంగా కలిచివేస్తోంది. నిరంజన్ కోరినవి వెంటనే అందించాల్సిందిగా పవన్ కల్యాణ్ తన టీం మెంబర్స్‌ను ఆదేశించారు. దీంతో పవన్ టీమ్, జనసేన కార్యకర్తలు హైదరాబాద్‌లోని డాగ్ ఫాంలో ఖరీదైన లాసా అప్సో జాతికి చెందిన కుక్కపిల్ల తో పాటు ట్యాబ్‌ను తీసుకువచ్చి నిరంజన్‌కు అందజేశారు. తల్లిదండ్రులు రాంగోపాల చారి, మానస చేతుల మీదుగా నిరంజన్‌కు అందించ డంతో ఆ బాలుడి కళ్లల్లో అంతులేని ఆనందం కనిపించింది. తన అభిమాన హీరో తాను అడిగిన వెంటనే కానుకలు పంపారని నిరంజన్ ఎంతో సంబురపడ్డాడు. అడిగిన వెంటనే కుక్కపిల్లను, ట్యాబ్‌ను అందజేసిన పవన్‌కు నిరంజన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.నిరంజన్ కుటుంబానికి సోనూసూద్ పరామర్శ : నిరంజన్ మరణవార్త తెలుసుకున్న ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ వీడియో కాల్ ద్వారా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. పవన్ కల్యాణ్ ఆర్థిక సాయం : ఈ నెల 17వ తేదీన ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హనుమకొండలో పర్యటించారు. పట్టణంలోని హనుమాన్‌గర్‌లో జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే అభిమాని ఇంటికి వెళ్లి పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచా నికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యా యంగా పలకరించారు. అతడి తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్ - మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఇది వరకు ఎక్కడ వైద్యం చేయిస్తున్నారనే వివరాల ను అడిగారు. నిరంజను కాపాడుకోవడానికి ఏయే అవకాశాలు ఉన్నాయనే విషయంపై ఆరా తీశారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించా రు.వేంకటేశ్వరస్వామి ఆశీస్సులను అందజేసి : తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్ కల్యాణ్ కప్పారు. స్వామివారి అక్షింతలు వేసి అతడిని ఆశీర్వదించారు. తర్వాత నిరంజన్? ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్స్ వీడియోలను వీక్షించారు. అనంతరం నిరంజన్ ఆరోగ్యం బాగుపడాలని భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించారు.గుర్తుండిపోయేలా పవన్ నోట్ : బాలుడిని పరామర్శించిన పవన్ అతనికి చిరకాలం గుర్తుండిపోయేలా ఓ నోట్ రాసి ఇచ్చారు. 'ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో - దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా' అని డైరీలో పవన్ కల్యాణ్ రాశారు. నిరంజన్ తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు.జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు : నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆస్పత్రి క్యాంటీన్‌లో పని చేసేవారని తెలిపారు. వారి జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు క్యాంటీన్ పెట్టించాలని తెలంగాణ జనసేన నాయకులకు పవన్ కల్యాణ్ తెలిపారు. అయితే తనను పరామర్శించే క్రమంలో బాలుడు కుక్కపిల్ల బొమ్మను చూపి పెంచుకోవాలని ఉందని పవన్‌కల్యాణ్‌కు చెప్పాడు. దాంతో ఆయన హైదరాబాద్‌లోని డాగ్ ఫాంలో ఖరీదైన లాసా అప్సో జాతికి చెందిన కుక్కపిల్లను కొని పంపించారు. దీనితో పాటు సినిమాలు చూసుకునేందుకు వీలుగా సామ్‌సంగ్ ట్యాబ్‌ను బహూకరించారు.

# ముగిసిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రతినిధుల బృందం జర్మనీ, స్విట్జర్లాండ్ పర్యటన



**రామగిరి, జూలై 08 :** తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో రాష్ట్రానికి చెందిన 35 మంది ప్రతినిధుల బృందం జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల్లో చేపట్టిన విద్యా అధ్యయన పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసిందని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. జూన్ 28 నుండి జూలై 6 వరకు సాగిన ఈ విదేశీ పర్యటన తెలంగాణ ఉన్నత విద్యా రంగానికి సరికొత్త దిశను చూపించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం వీసీకి అభినందనలు తెలియజేసింది. అనం తరం పర్యటన వివరాలు, సాధించిన అభ్యస నాలను వీసీ మీడియాకు వివరించారు. అంత ర్జాతీయ ఖ్యాతి గల విద్యా సంస్థలైన యూ నివర్సిటీ ఆఫ్ గోట్టింగెన్, మ్యూనిక్, మెర్సిడెస్-బెంజ్ సెంట్రల్ ఫెసిలిటీ సెంటర్, యూనివర్సి టీ ఆఫ్ ఆఖెన్, ఓస్నాబ్రియా విశ్వవిద్యాలయా లను సందర్శించినట్లు తెలిపారు. ఈ సంస్థలలో అనుసరిస్తున్న ఉన్నత విద్య, పరిశోధనలు, వినూత్న బోధన పద్ధతులు, పరిశ్రమ--విద్యా రంగాల భాగస్వామ్యాలను క్షుణ్ణంగా పరిశీలిం చినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో కలిసి ఆయా కార్యక్రమాల రూపకల్పనకు పర్యటన దోహద పడుతుందన్నారు.ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు : విద్యార్థులు, బోధనా సిబ్బంది పరస్పర మార్పిడిట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ : విదేశీ వర్సిటీలతో సంయుక్త విద్యా కోర్సులుసంయుక్త పరిశోధనలు : అంతర్జాతీయ స్థాయి రీసెర్చ్ ప్రాజెక్టుల నిర్వహణడిజిటల్ లెర్నింగ్ : ఆన్‌లైన్ లఅభివృద్ధిగ్రామీణ వర్సిటీలకు దిక్సూచిపరిమిత వనరులతోనే నాణ్యమైన విద్యను ఎలా అందించవచ్చో, డిజిటల్ టెక్నాలజీ ఆధారిత బోధన, పరిశోధనాభిముఖ పరిపాలన, కమ్యూ నిటీతో అనుసంధానాన్ని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలో యూరప్ వర్సిటీలు మార్గదర్శకత్వాన్ని చూపాయని వీసీ కొనియాడారు. ప్రత్యేకంగా తెలంగాణలోని గ్రామీణ, అర్బన్-రూరల్ ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న విశ్వవిద్యాలయాలకు ఈ నమూనాలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయ న్నారు. ప్రాంతీయ అభివృద్ధి, సామాజిక న్యాయం, సమగ్ర పురోగతి సాధించడమే విద్యాసంస్థల కావాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన



**హైదరాబాద్, జులై 8 :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా (గురువారం) తెలంగాణలో పర్యటిం చనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రేపు ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నా ం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

# గ్రామ రెవెన్యూ అధికారి నుంచి జిల్లా రిజిస్ట్రార్‌గా వరుసగా 8 ప్రభుత్వ కొలువులు సాధించిన యువకుడు



**హైదరాబాద్ :** ఆ యువకుడిది కల్లుగీత కుటుంబం. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాడు. తండ్రి స్ఫూర్తి ద్వారా పట్టుదలతో చదివి 2018లో వీఆర్‌వోగా ఉద్యోగం పొందాడు. ఆ తర్వాత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రైల్వే ఎస్సై, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, రైల్వే జేఈ, రాష్ట్ర పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఇలా వరుస కొలువులు సాధించాడు. అంతేకాదు రాష్ట్రస్థాయిలో ఉన్నత కొలువైన గ్రూప్-1లో 36వ ర్యాంకు సాధించి జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు. మరి అతడు ఎలా సన్నద్ధమయ్యాడు? ప్రిపరేషన్? వెనకున్న ప్రణాళికలేంటో తెలుసుకునేందుకు అతడితో 'ఈనాడు ఈటీవీ భారత్'సంప్రదించింది.మీరు ప్రాథమిక, ఉన్నత విద్యను ఎక్కడ అభ్యసించారు నేను హనుమకొండలో పుట్టి పెరిగాను. స్థానిక తేజస్వి స్కూల్‌లో పదోతరగతి వరకు చదువుకు న్నాను. ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్‌ను వరం గల్‌లోని ఎస్‌ఆర్ విద్యా సంస్థలో పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం అందరిలాగే మీరూ సన్నద్ధమయ్యారు. కానీ 8 కొలువులు ఎలా సాధించారు?నేను 2015లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఇలా బీటెక్ చేస్తూనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఆ తర్వాత కూడా 2019 వరకు పూర్తిగా చదవుకే నా సమయం కేటా యించాను. ఈ సమయంలో ప్రభుత్వం ప్రకటిం చిన ఉద్యోగాలు రాస్తూ వచ్చాను. 2019లో శాఖల ఉద్యోగాల కోసం అవసరమైన కామన్? సిలబస్‌పై ఎక్కువ దృష్టి పెట్టాను. దీంతో పాటు మెం టార్స్ సూచనలు పాటిం చడం, కోచింగ్ సంస్థల్లో శిక్షణ తీసుకోవడం వల్ల విజయావక ాశాలు పెరిగాయి.మీరు లక్ష్యంతోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించారాలేక ఇది మీ తల్లిదండ్రుల కలామా నాన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. ప్రస్తుతం పరకాలలో పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తు న్నారు. మా నాన్న స్ఫూర్తితో నేను కూడా ఒక ఉన్నతమైన ప్రభుత్వ కొలువు సాధించాల నుకున్నాను. దీని కోసం బీటెక్ నుంచే కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కోసం ప్రిపేర్ అవుతూ వచ్చాను.మొదట ఎస్సైగా విధులు నిర్వహిం చారు. ఇప్పుడు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు ఉద్యోగాల అనుభవం ఎలా ఉంరెండు ఉద్యోగాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నేను 019లో ఎస్సైగా ఎంపికై, ఐదు సంవత్సరాలు ఉమ్మడి వరంగల్‌లో వివిధ పోలీస్? స్టేషన్లలో పనిచేశాను. అయితే, ముందు నుంచే గ్రూప్? 1 ఉద్యోగాల పట్ల ఆసక్తి ఉండటంతో, 2024లో నోటిఫికేషన్ వెలువడగానే సంవ త్సరం పాటు సెలవు పెట్టి, పూర్తిగా చదవడానికే ఆదాయం అందించే శాఖలో, రోజూ రూ.కోట్ల లావాదేవీలతో సాగే ఈ సున్నితమైన ఉద్యోగం ఛాలెంజింగ్‌గా ఉంది.మీరు ఎంతకాలం ట్రైనింగ్ పూర్తి చేశారు ప్రస్తుతం ఎలా సాగుతోందిసాధారణంగా గ్రూప్1 ఉద్యోగ శిక్షణ ఒక సంవత్సరం పాటు ఉంటుంది. ఇందులో భాగంగా నేను ఇండిపెండెంట్ సబ్? రిజిస్ట్రార్‌గా వైరాలో మూడు నెలలు పనిచేశాను. ఆరు వారాలు ఫౌండేషన్? కోర్సు కూడా జరిగింది. సెప్టెంబర్‌లో హెడ్ ఆఫీసులో పనిచేయడంతో ఏడాది శిక్షణ పూర్తవుతుంది.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి నీళ్లు ఎలా రావో చూస్తా



**వరంగల్:** గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీళ్లను వదులుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాళేశ్వ రంలో నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకు వస్తుందన్నారు. ఇలాంటి వారిని ఉరితీసినా తప్పులేద్నారు. నీళు ఉండి కూడా వరంగల్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవా రం రేవంత్ రెడ్డి ప్రసంగం సొల్లు తప్ప, ఏదీ నిజం లేదని, అబద్ధాలకు చొక్కా తొడిగితే రేవ ంత్ రెడ్డిలా ఉంటుందని ఎద్దేవా చేశారు. అబ ద్ధాల్లో నోబెల్ ఇవ్వాల్సి ఉంటే రేవంత్‌కే ఇవ్వా లని సూచించారు.తుమ్మిడిహట్టి పేరిట రూ.2, 328 కోట్లు తిన్నారు : కాంగ్రెస్ ఉన్నప్పుడే తుమ్మిడిహట్టికి ఒప్పందం అయినట్లు సీఎం చెప్పారని, తుమ్మిడిహట్టికి రూ.6,500 కోట్లు ఖర్చుపెట్టినట్లు సీఎం చెబుతున్నారని, 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభు త్వాలే ఉన్నాయని హరీశ్ రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టిలో తట్టెడు మట్టి ఎందుకు తీయలేదు? ప్రశ్నించారు. పనులు చేయకుండా రూ.2,328 కోట్లు తిన్నా రని, మట్నబిలైజేషన్ అడ్వాన్స్‌లు పేరిట కాంగ్రె స్ నేతలు రూ.2,328 కోట్లు తిన్నారని ఆరోపిం చారు. తమ ప్రభుత్వం రాగానే మట్నబిలైజేషన్ అడ్వాన్స్ విధానాన్ని తొలగించామని, తుమ్మిడి హట్టికి అనుమతి ఇవ్వాలని మహారాష్ట్ర ఇరిగేషన్ మంత్రిని కలిశానని అన్నారు.కాంగ్రెస్ సీఎంలు కోరితేనే ఇవ్వలేదని, మీకు ఎలా ఇస్తామని ప్రశ్నించారని తెలిపారు. తుమ్మిడిహట్టి నిర్మాణానికి తాము అన్ని ప్రయత్నాలు చేశామని పేర్కొన్నారు. ప్రాజెక్టును కావాలని మార్చలేదని, నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయం చూసుకోవాలని కేంద్రం లేఖ రాసిందని, నీళ్లు లేని చోట తుమ్మిడిహట్టి ప్రాజెక్టును కాంగ్రెస్ తలపెట్టిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి అసత్య మాటలు మాట్లాడటం ఇప్పటికైనా మానాలని హితవు పలికారు.“నీటిపారుదల మంత్రిగా నాకు 3 నెలలు అవకాశం ఇవ్వండి. నీళ్లు ఎలా రావో చూస్తా. కన్నెపల్లి నుంచి ఎల్లంపల్లి వరకు నీళ్లు తెస్తా. నీళ్లు తీసుకురాలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా. ఈ మూడు నెలలపాటు జీతం, కారు, ఫ్యూన్, ఫ్యాన్ ఏమీ వద్దు. నాకు పదవులు ఏం కొత్త కాదు. 13 ఏళ్లు మంత్రిగా చేశాను” - హరీశ్‌రావు, మాజీ మంత్రరాజీనామా చేస్తా : సీఎం తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చిందని చెప్పారని, ఒకవేళ అనుమతి ఇచ్చింది నిజమే అయితే రేవంత్ రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెడితే రాజీనామా చేస్తామని సవాల్ చేశారు. తుమ్మిడిహట్టి నిర్మిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని, కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లు అయినా తుమ్మిడిహట్టి కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే అవినీతి ఉందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉండగా జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని విమర్శించారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పార్టీ మారగానే మాటమార్చారని వెల్లడించారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టవద్దని నిపుణులు చెప్పలేదని, మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దని నిపు ణులు చెప్పినట్లు సీఎం అసత్యాలు చెబుతు న్నారని విమర్శించారు. తమ నివేదికను దృష్టిలో పెట్టుకునే మేడిగడ్డ నిర్మించినట్లు నిపుణులు అఫిడవిట్ ఇచ్చారని తెలిపారు. సీఎం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చిల్లర రాజకీయాల కోసం రైతులు, రాష్ట్ర ప్రయో జనాలు పక్కనపెట్టడం సరైనదేనా? నిలదీశారు. వ్యాప్కోస్‌ను చెఫ్‌తో పోలుస్తూ రేవంత్ రెడ్డి మాట్లాడారని, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు కోసం వ్యాప్కోస్‌ను తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమేనని, చేవెళ్ల-ప్రాణహితకు వ్యతిరేకంగా లేఖలు వచ్చాయని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాప్కోస్‌ను కోరామని అన్నారు. నేడు రేవం త్‌రెడ్డి ప్రభుత్వం కూడా వ్యాప్కోస్‌కే పనులు అప్పగించిందని, రేవంత్ రెడ్డి పనులు అప్పగిస్తే కరెక్టు మేం చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. “తుమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీలు లేవని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ వద్ద 240 టీఎంసీలు వాడుకోవచ్చని నివేదికలో పేర్కొంది. 160 టీఎంసీలు లేని దగ్గర ప్రాజెక్టు కట్టాలా? 240 టీఎంసీలు ఉండే దగ్గర ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ నిర్మించాం. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 16 టీఎంసీలు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు. కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టు అంచనా రూ.1,400 కోట్ల నుంచి రూ.4 వేల కోట్లకు పెంచారు” - హరీశ్‌రావు, మాజీ మంత్రిమోటార్లు ఇప్పుడు ఆన్ చేసినా నీళ్లు వస్తాయి :తప్ప వాస్తవం లేదని వివరించారు.

# కర్ణాటక, ఏపీ రాష్ట్రాల అక్రమ ప్రాజెక్టులు వెంటనే ఆపాలి



**మహబూబ్‌నగర్ :** కర్ణాటకలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ ను బీఆర్ఎస్ నాయకులు బుధ వారం పరిశీలించారు. మాజీ మంత్రులు డా. సి.లక్ష్మారెడ్డి ,శ్రీనివాస్ గౌడ్ , ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, నరేం దర్ రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కు మార్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతర నాయకులు రాజోలి బండను సందర్శించిన వారిలో ఉన్నారు.ఆ ర్డీఎస్ వద్ద కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు తుంగభద్ర జలాల దోపిడీకి చేపట్టిన అక్రమ ప్రాజెక్టులు ) వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నీటి వాటా కోల్పోతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైట్ కెనాల్ కట్టడానికి ప్రయత్నం చేసిందని ఆరోపించారు. గతంలో ఆర్డీఎస్ రైతుల కష్టాలు కేసీఆర్ పాదయాత్ర ద్వారా తెలుసుకున్నారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం తుమిళ్ల లిఫ్ట్ పూర్తి చేశారని పేర్కొన్నారు.తుంగభద్ర జలాల దోపిడీతో ఆర్డీఎస్ ఆయకట్టు ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాకే మొదటగా అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. కొడంగల్‌కు ఎన్‌వోసి కోసం ఏపీ, కర్ణాటక మిగతా ప్రాజెక్టులకు రేవంత్ ఎన్‌వోసీ ఇచ్చినట్లు సమాచారం తమకు ఉందని వెల్లడించారు. కొడంగల్ లిఫ్ట్ అనేది అనవసరమైన ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. పనికి రాని ప్రాజెక్ట్ కోసం తెలంగాణ హక్కులను కోల్పోతున్నామని తెలిపారు.శ్రీశైలం వరకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కండ్లు మూసుకొని కూర్చుందని,మంత్రుల బృందం ఒకసారి వచ్చి చూడాలని, మహబూబ్ నగర్ హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తెలంగాణ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని వివరించారు.

# బాన్సువాడ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య



**కామారెడ్డి :** జిల్లాలోని బాన్సువాడ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపుతుంది. హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మద్నూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది.జ్వరం ఉందని కాలేజీకి వెళ్లకుండా ఉదయం హాస్టల్‌లోనే ఉండిపోయింది. విద్యార్థినిలు అమృత ఆత్మహత్య విషయాన్ని హాస్టల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు పోలీసులకు, విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గందరగోళంగా సర్! ఎన్యూమరేషన్ ఫారాల్లో అన్నీ తప్పులే



**హైదరాబాద్ :** సాధారణ, మున్సిపాలిటీ ఎన్నికల్లో తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితా మాదిరిగా ఎన్యూ మరేషన్ ఫారాలు కూడా అలానే మారడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఒకే కుటుంబ సభ్యుల్లోని ఓటర్లు వేర్వేరు బూత్‌లలో ఉంటుండగా తాజాగా పేర్లు ఒకరివి, ఫొటో మరొకరివి ప్రచురితం కావడం తో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. మరోవైపు డబుల్? ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్? ఫారాలు బీఎల్వోల దగ్గర ఉన్నాయి. ఆ ఓటరు ఓ కాలనీలో ఉండగా మరో ?కాలనీ బూత్?లో ఎన్యూమరేషన్? ఫారం ఉంది. అలాంటి ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు ఎక్కడ ఉన్నాయో తెలియని గందరగోళం నెలకొంటుంది. కరీంనగర్ నగరంలో మంకమ్మతోటలో పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారంలో పేరు మహిళది ఉండగా ఫొటో వద్ద మాత్రం పురుషుడిది ప్రచురితమైంది. అయితే వాస్తవంగా ఓటరు గుర్తింపుకార్డు ఆధారంగా ఈ ఫారాలు రావాల్సి ఉండగా ఇందులోనూ ఫొటోలు తారుమారు ఎలా అవుతాయనది ప్రశ్నల్లానే మిగిలిపోతు న్నాయి.బీఎల్వోలకు దొరకని ఓటర్లు : ఇక్కడ బూత్‌స్థాయిలో ఉన్న ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల చిరునామాలు దొరక్క పోవడంతో బీఎల్వోలు ఇబ్బందులు పడుతున్నా రు. బూత్‌లకు, ఇంటి నంబర్లకు తేడా ఉండటంతో వాటన్నింటినీ ఎలా పంపిణీ చేయాలని తలలు పట్టుకుంటున్నారు. బీఎల్వోల వెంట బీఎల్‌ఏలు ఉంటే తప్ప సక్రమంగా పంపిణీ చేయడం సాధ్యం కావడం లేదనే అభిప్రాయముంది. చాలా చోట్ల రాజకీయ పార్టీలు నియమించుకున్న బూత్? లెవల్? ఏజెంట్లు క్షేత్రస్థాయిలో పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

PRGI NO: APTEL/26/A1204
డైలీ న్యూస్ పేపర్

# గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో టీమిండియా బద్దలు కొట్టిన దారుణమైన రికార్డులివే




భారత క్రికెట్ జట్టుకు కొత్త కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించినప్పుడు, అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయన పర్యవేక్షణలో జట్టు దూసుకుపోతుందని భావించారు. కానీ వాస్తవంలో పరిస్థితి మరోలా తయారైంది. గంభీర్ హెడ్ కోచ్ అయినప్పటి నుంచి టీమిండియా ప్రదర్శనపై, వ్యూహాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని బలహీనమైన జట్ల చేతిలో కూడా భారత్ పరాజయం పాలుకావాల్సి వచ్చింది. తాజాగా జూన్ 30వ తేదీ నాటికి వెలువడిన నివేదికల ప్రకారం, గంభీర్ హయాంలో జట్టు ఖాతాలో ఏకంగా 7 అత్యంత ఘోరమైన రికార్డులు వచ్చి చేరాయి. ఇది భారత క్రికెట్ చరిత్రలోనే ఒక చేదు అధ్యాయంగా మిగిలిపోనుంది.

ఐర్లాండ్ చేతిలో ఘోరంగా సిరీస్ ఓడిపోయిన భారత్‌టీమిండియాకు తగిలిన అన్నిటికంటే పెద్ద ఎదురుదెబ్బ ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్. రెండు మ్యాచ్‌ల ఈ చిన్న సిరీస్‌ను భారత్ 0-2 తేడాతో పూర్తిగా చేజార్చుకుంది. క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ జట్టు చేతిలో భారత్ ఒక టీ20 సిరీస్ ఓడిపోవడం ఇదే మొట్టమొదటిసారి కావడం గమనార్హం. గతంలో ఎప్పుడూ ఐర్లాండ్ టీమ్ భారత్‌పై ఇంతలా ఆధిక్యం చెలాయించలేదు. ఈ ఘోర పరాజయం చూశాక గంభీర్ సెలెక్షన్ ప్రాసెస్, మ్యాచ్ స్ట్రాటజీలపై తీవ్రమైన ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.36 ఏళ్ల తర్వాత స్వదేశంలో టెస్టు మ్యాచ్ చేజారిన వేళభారతదేశంలో పిచ్‌లు ఎప్పుడూ మన స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటాయి. అందుకే మన సొంత మైదానాల్లో టీమిండియాను ఓడించడం ఏ విదేశీ జట్టుకైనా సింహస్వప్నమే. కానీ, గంభీర్ కోచ్‌గా ఉన్న సమయంలో ఆ రికార్డు కూడా తుడిచిపెట్టుకుపోయింది. న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు వచ్చి, మన గడ్డపైనే మనల్ని టెస్టు మ్యాచ్‌లో ఓడించి చరిత్ర సృష్టించింది. దాదాపు 36 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత భారత్ తన సొంతగడ్డపై కివీస్ చేతిలో ఒక టెస్టు మ్యాచ్‌లో ఓడిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.పాతికేళ్ల నాటి ఘనమైన రికార్డు బద్దలుభారత జట్టుకు సొంతగడ్డపై మరో పెద్ద షాక్ తగిలింది దక్షిణాఫ్రికా రూపంలో. ప్రొటీస్ జట్టుతో జరిగిన హోమ్ టెస్ట్ సిరీస్‌ను భారత్ దారుణంగా కోల్పోయింది. స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా ఒక టెస్టు సిరీస్‌ను ఓడిపోవడం గత 25 ఏళ్లలో ఇదే మొదటిసారి. కనీసం డ్రా అయినా చేసుకుంటారనుకున్న మ్యాచ్‌లలో ఘోరమైన బ్యాటింగ్ వైఫల్యాల వల్ల భారత్ సిరీస్‌ను ప్రత్యర్థి చేతికి అప్పగించాల్సి వచ్చింది.లంక చేతిలో వన్డే సిరీస్ ఫ్లాప్‌గతంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల సారథ్యంలో భారత జట్టు ఆస్ట్రేలియాకు వెళ్లి వరుసగా రెండుసార్లు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది. కానీ, గంభీర్ కోచింగ్ పీరియడ్‌లో ఆ విజయాల పరంపరకు బ్రేక్ పడింది. ఆస్ట్రేలియా జట్టు టీమిండియాను ఓడించి ఆ ప్రతిష్ఠాత్మక ట్రోఫీని తిరిగి దక్కించుకుంది. దీనికి తోడు, లంక గడ్డపై శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా భారత్ ఊహించని పరాజయాన్ని మూటగట్టుకుంది. చాలా కాలం తర్వాత శ్రీలంక జట్టు భారత్‌పై వన్డే సిరీస్ గెలిచి పెద్ద సంచలనానికి తెరలేపింది.

# బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 6 బ్యాంకులకు భారీ జరిమానా.




ప్రజలు తమ కష్టార్జితాన్ని బ్యాంక్‌లలో సురక్షితంగా ఉంచుకోవాలని భావిస్తారు. అయితే, నిబంధనలను ఉల్లంఘిస్తున్న బ్యాంక్‌లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల కాలంలో పలు సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ జరిమానాలు విధించడమే కాకుండా, ఒక బ్యాంక్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసింది. ఈ చర్యల వెనుక గల కారణాలు, వీటివల్ల డిపాజిటర్లపై పడే ప్రభావం, అలాగే మీ డబ్బు భద్రత గురించి వివరంగా తెలుసుకుందాం.ఆర్‌బీఐ చర్యలు తీసుకున్న బ్యాంకులు, కారణాలు:1. ది నబపల్లి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (పశ్చిమ బెంగాల్): ఈ బ్యాంక్‌పై కర రూ.3 లక్షల జరిమానా విధించారు. కస్టమర్ల ఖ్జ (నో యువర్ కస్టమర్) రికార్డులను జఖ్జ= (సెంట్రల్ ఖ్జ రికార్డ్స్ రిజిస్ట్రీ) పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయనందుకు ఈ చర్య తీసుకున్నారు.2. ది మోడరన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (మహారాష్ట్ర): ఈ బ్యాంక్‌పై రూ.1 లక్ష జరిమానా పడింది. ఎక్స్‌పోజర్ నిబంధనలను ఉల్లంఘించి ఒకే రుణగ్రహీతకు నిర్దేశించిన పరిమితికి మించి రుణం ఇవ్వడం, ఖ్జ రికార్డులను సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడం వంటి తప్పులు చేసింది.

3. ది లాల్‌గుడి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ (తమిళనాడు): ఈ బ్యాంక్‌కు రూ.1 లక్ష జరిమానా విధించారు. క్యాపిటల్ అడిక్వసీ (మూలధన పర్యాప్తత) నిబంధనలను పాటించకపోవడం, జ=ూ= (క్యాపిటల్ టు రిస్క్-వెయిటెడ్ అసెట్ రేషియో) తక్కువగా ఉన్నప్పటికీ షేర్ క్యాపిటల్‌ను తిరిగి ఇవ్వడం, షేర్ లింకింగ్ టు బారోయింగ్ నిబంధనలను పాటించకుండా రుణాలు మంజూరు చేయడం దీనికి కారణాలు.4. జిల్లా సహకారి కేంద్రీయ బ్యాంక్ (మధ్యప్రదేశ్): రూ.1.5 లక్షల జరిమానా. అన్‌క్లెయిమ్డ్ మొత్తాన్ని ణజూాఖీ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్)కు సకాలంలో బదిలీ చేయకపోవడం, ఖాతాల రిస్క్ కేటగిరైజేషన్‌ను సమీక్షించకపోవడం.5. శ్రీ కడి నాగరిక్ సహకారి బ్యాంక్ లిమిటెడ్ (గుజరాత్): అత్యధికంగా రూ.16.30 లక్షల జరిమానా విధించింది. ఒకే గ్రూప్ ఆఫ్ బారోయర్స్‌కు పరిమితికి మించి రుణం ఇవ్వడం, రుణాల వినియోగాన్ని పర్యవేక్షించకపోవడం.6. యూత్ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ బ్యాంక్: రూ.40,000 జరిమానా. సరైన ఖ్జ లేకుండా ఇన్‌యాక్టివ్ ఖాతాలను మళ్లీ యాక్టివేట్ చేయడం.సర్వోదయ కో-ఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు: ఆర్‌బీఐ అత్యంత కఠినమైన చర్యను సర్వోదయ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌పై తీసుకుంది. దీని బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. బ్యాంకు వద్ద తగినంత మూలధనం లేకపోవడం, ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటం, డిపాజిటర్ల ప్రయోజనాలకు ప్రమాదం పొంచి ఉండటం వంటి కారణాలను ఆర్‌బీఐ పేర్కొంది.డిపాజిటర్లు ఆందోళన చెందాలా?

ఆర్‌బీఐ స్పష్టం చేసిన ప్రకారం, ఈ జరిమానాలు లేదా చర్యలు డిపాజిటర్ల ఖాతాలపై ఎటువంటి ప్రభావం చూపవు. వారి మునుపటి లావాదేవీలు చెల్లుబాటు అవుతాయి. డిపాజిటర్ల డబ్బు ణ×జ+జ (డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్) పథకం కింద సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ బ్యాంక్ దివాళా తీసినా, ప్రతి డిపాజిటర్‌కు, ప్రతి బ్యాంక్‌లో ఉన్న వారి డిపాజిట్లపై (సేవింగ్స్, కరెంట్, ఖీణ, =ణ అన్నీ కలిపి) గరిష్టంగా రూ.5 లక్షల వరకు బీమా ఉంటుంది. మీ డిపాజిట్లు రూ.5 లక్షల కంటే ఎక్కువగా ఉంటే, ఆ మొత్తాన్ని వేర్వేరు బ్యాంక్‌లలో పంపిణీ చేసి ఉంచుకోవడం శ్రేయస్కరం.

# బర్త్ డే వేళ ధోనీకి సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చిన సెహ్వాగ్..




భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత సక్సెస్ ఫుల్ కెప్టెన్‌గా, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజంగా పేరొందిన మహేంద్ర సింగ్ ధోనీ జూలై 7న తన 45వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. 2025 ఐపీఎల్ సీజన్ తర్వాత క్రికెట్‌కు దూరంగా ఉంటున్న ధోనీని, 2026 ఐపీఎల్ సీజన్ మొత్తం మైదానంలో చూడాలని అభిమానులు ఎంతో ఆశపడ్డారు. ఈ ప్రత్యేకమైన రోజున ధోనీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల నుంచి, తోటి క్రికెటర్ల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, వీటన్నింటికంటే టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెట్టిన ఒక సుదీర్ఘమైన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు వీరిద్దరి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న పుకార్లకు చెక్ పెడుతూ, సెహ్వాగ్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ధోనీపై ఉన్న అపారమైన గౌరవాన్ని చాటుకున్నాడు. సెహ్వాగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తామిద్దరూ కలిసి భారత్ తరఫున, అలాగే ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఆడిన పాత జ్ఞాపకాల ఫోటోలను పంచుకుంటూ ఒక ఆసక్తికరమైన విషయాన్ని రాసుకొచ్చాడు. కేరళలోని పాలక్కాడ్ అడవుల మధ్య ఉండే ధోనీ వాటర్‌ఫాల్స్?తో ఎమ్మెస్ ధోనీ వ్యక్తిత్వాన్ని పోల్చాడు. 'కేరళలోని ఒక దట్టమైన అడవిలో ఒక జలపాతం ఉంది, దాని పేరు 'ధోనీ'. అక్కడికి చేరుకోవడం అంత సులభం కాదు. దారి చాలా కష్టంగా ఉంటుంది, కచ్చితంగా గైడ్ సహాయం కావాలి. మూడు గంటల పాటు నడిస్తేనే ఆ జలపాతం కనిపిస్తుంది. కానీ ఒక్కసారి అది కనిపిస్తే ఎలా ఉంటుందో తెలుసా? పైకి చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది, కానీ లోపల మాత్రం అగ్నిపర్వతంలా ఉంటుంది. దాని ఉపరితలం ఎంతో మృదువుగా ఉన్నా, దగ్గరికి వెళ్తేనే దానికి ఎంత శక్తి ఉందో అర్థమవుతుంది" అంటూ సెహ్వాగ్ పేర్కొన్నాడు.ఈ జలపాతం గురించి కేరళ అటవీ శాఖ ఒక ప్రత్యేకమైన నిబంధనను కూడా రాసిపెట్టిందని సెహ్వాగ్ గుర్తుచేశాడు. "ఈ నీరు పైకి చూడటానికి చాలా ప్రశాంతంగా ఉంటుంది, కానీ లోపల అలా ఉండదు" అనేదే ఆ బోర్డు సారాంశం. "అయితే ఈ రూల్ అక్కడ ఉన్న జలపాతం కోసమా లేక జెర్సీ నంబర్ 7 కోసమా అనేది నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. మహేంద్ర సింగ్ ధోనీ పుట్టకముందు నుంచే కేరళలో ఆ ధోనీ అనే ప్రదేశం ఉంది. ప్రకృతికి ముందే తెలుసేమో.. భవిష్యత్తులో ఇలాంటి వ్యక్తి ఒకరు వస్తారని, కఠినమైన మార్గాల తర్వాతే ఒక అద్భుతమైన ప్రదేశంలో అతను మనకు కనిపిస్తాడని, ఒకసారి అతన్ని చూశాక మర్చిపోవడం ఎవరికైనా కష్టమని ప్రకృతికి ముందే తెలిసినట్లుంది" అంటూ సెహ్వాగ్ ఎంతో భావోద్వేగంగా రాసుకొచ్చాడు. జూలై 7 మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పెట్టిన ఈ పోస్ట్‌కు కొద్ది గంటల్లోనే లక్షలాది లైకులు, కామెంట్లు వచ్చాయి.ఇక ధోనీ కెరీర్ రికార్డులను చూస్తే, వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి ఓపెనర్‌గా గౌతమ్ గంభీర్ అత్యధికంగా 117 మ్యాచ్‌ల్లో 5,131 భాగస్వామ్య పరుగులు చేశాడు. అయితే ధోనీ కూడా సెహ్వాగ్‌తో కలిసి వేర్వేరు ఫార్మాట్లలో ఇన్నింగ్స్‌లు ఆడాడు. వీరిద్దరూ కలిసి 18 ఇన్నింగ్స్‌ల్లో 48.47 సగటుతో 824 పరుగులు జోడించారు. 45 ఏళ్లు పూర్తి చేసుకున్న ధోనీ.. అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించాల్సింది ఏమీ మిగల్లేదు. భారత జట్టుకు 2007 టీ20 వరల్డ్ కప్, 2011 వన్డే వరల్డ్ కప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి మూడు వైట్-బాల్ ఐసీసీ ట్రోఫీలను అందించిన ఏకైక కెప్టెన్‌గా ఆయన రికార్డు సృష్టించాడు. తన కెరీర్‌లో 500 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి, 16 వేలకు పైగా పరుగులు చేసిన ధోనీ, భారత క్రికెట్‌లో ఒక సజీవ పురాణంగా నిలిచిపోయాడు. కాగా, సెహ్వాగ్ పెట్టిన ఈ అద్భుతమైన పోస్టుకు ధోనీ నుంచి ఇంకా రిప్లై రాలేదు. సాధారణంగా ధోనీ సోషల్ మీడియాలో, ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్దగా యాక్టివ్‌గా ఉండకపోవడమే ఇందుకు కారణం కావచ్చు.

# హోం లోన్ కట్టకపోతే ఇంట్లోని వస్తువులను బ్యాంక్ స్వాధీనం చేసుకోవచ్చా..?



సొంతిల్లు నిర్మించుకోవడం అనేది ప్రతీఒక్కరి కల. ఇందుకోసం చెమటోడ్చి సంపాదించుకున్న సొమ్మును కూడబెట్టుకుంటుంటారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకైతే సొంతిల్లు అనేది చాలా ఆర్థిక భారంతో కూడుకున్న పని. దీంతో తమ దగ్గర ఉన్న డబ్బులు సరిపోక బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుంటూ ఉంటారు. ఈ డబ్బులో కొత్త ఇల్లు నిర్మించుకోవడం లేదా ఇంటిని కొనుగోలు చేయడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే ఏదైనా కారణం చేత మీరు రుణాన్ని తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో బ్యాంకు మీ ఇంటిని స్వాధీనం చేసుకుంటుంది. అయితే ఇంట్లోనే వస్తువులను కూడా స్వాధీనం చేసుకునే ఘటనలు మనం చూస్తూ ఉంటాం. దీంతో బ్యాంకులో ఇంటితో పాటు ఇంట్లోని సమాన్లను కూడా జప్తు చేయవచ్చా..? దీనికి సమాధానం ఇప్పుడు చూద్దాం.వస్తువులను స్వాధీనం చేసుకోవచ్చా..?రూల్స్ ప్రకారం గడువు తేదీలోగా రుణం చెల్లించలేని పక్షంలో బ్యాంకులు నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు జారీ చేసి ఇంటిని స్వాధీనం చేసుకోవచ్చు. కానీ ఇంట్లోని వస్తువులను స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి హక్కు ఉండదు. ఇల్లు లేదా ఆస్తిని తాకటబ్యాంకులు నిబంధనల ప్రకారం ముందుగా్ ట పెట్టి రుణం తీసుకుంటారు. కానీ ఇంట్లోని సోఫాలు, బల్లలు, ఎల్‌ఈడీ టీవీలు, సీలింగ్ ఫ్యాన్లు, వంటసామాగ్రి, గ్యాస్ స్టవ్‌లు, విద్యుత్ ఉపకరణాలు, చెక్క మంచాలు, ఇతర గృహోపకరణాలు వంటి వస్తువులను తాకట్టు పెట్టరు. దీంతో ఆర్థిక సంస్థలకు ఇంట్లోని వస్తువులను స్వాధీనం చేసుకునే హక్కు ఉండదని నిబంధనలు చెబుతున్నాయి. ఒకవేళ బ్యాంకులు స్వాధీనం చేసుకుంటే ఖాతాదారులు బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ లేదా వినియోగ దారుల ఫోరంకు ఫిర్యాదు చేయవచ్చు. బ్యాంకులు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాతో పాటు నష్టానికి ఖాతాదారులకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.అలా నష్టపరిహారం చెల్లించాల్సిందే..

తాజాగా ఒక కేసులో రూ.3 లక్షల నష్టపరిహారంతో పాటు మానసిక వేధింపులకు రూ.25 వేలు, న్యాయ ఖర్చుల కోసం రూ.10 వేలు ఖాతాదారుడికి చెల్లించాలని హెచ్‌డీఎఫ్‌సీని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. బరోడాకు చెందిన నీరూ చౌహాన్ భర్త మనీష్ చౌహాన్ 2016లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుండి రూ.12.38 లక్షల హోం లోన్ తీసుకున్నారు. ఈ రుణంతో ఒక ఇల్లు కొనుగోలు చేశారు. అయితే ఆయన ఇంటి బీమా కూడా తీసుకున్నారు. చౌహాన్ 2019లో కాలేయ వ్యాధితో మరణించారు. ఆయన భార్య నీరూకు ఎలాంటి ఆదాయం లేకపోవడంతో ఈఎంఐ చెల్లించలేకపోయారు. 2023లో బ్యాంక్ స్వాధీనం చేసుకుని ఆమెను ఇంట్లోని ఆమె సామాన్లను కూడా తీసుకెళ్లనీయలేదు. 2024 జూలైలో ఆమె వినియోగదారుల ఫోరంలో కేసు దాచేసింది. దీంతో కోర్టు చెల్లించాల్సిందిగా బ్యాంక్‌కు ఆదేశాలిచ్చింది.

# భారత్ తరపున టీ20ల్లో అరంగేట్రం చేసిన టాప్ 5

అత్యంత పిన్న వయస్కులైన ఆటగాళ్లు వీరే ఐపీఎల్ ఎంతో మంది యువ ఆటగాళ్లకు టీమిండియా తరఫున అంతర్జాతీయ టీ20ల్లో ఆడేందుకు అద్భుతమైన అవకాశాలను కల్పించింది. అయితే బ్లూ జెర్సీ వేసుకుని తన మొదటి మ్యాచ్ ఆడకముందే సోషల్ మీడియా నుంచి క్రికెట్ పండితుల వరకు అందరి దృష్టిని ఆకర్షించిన వండర్ కిడ్ ఎవరైనా ఉన్నారా అంటే.. దానికి సమాధానం ఒక్కరే, తనే వైభవ్ సూర్యవంశీ. ఎప్పుడెప్పుడా అని అందరూ ఎదురుచూస్తున్న ఈ 15 ఏళ్ల యువ బ్యాటింగ్ సంచలనం ఎట్టకేలకు అంతర్జాతీయ క్రికెట్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ 2026 సీజన్ లో తన అద్భుతమైన ఆటతీరుతో దుమ్మురేపినందుకు గాను, ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే భారత టీ20 జట్టులో ఈ చిన్నారికి చోటు లభించింది. సరికొత్త చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ఖచ్చితంగా 15 సంవత్సరాల 99 రోజుల వయస్సులోనే వైభవ్ సూర్యవంశీ టీమిండియా తరఫున టీ20 ఇంటర్నేషనల్స్ ఆడి, భారతదేశం తరఫున ఈ ఫార్మాట్‌లో ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు.




2026, జూలై 4న ఇంగ్లాండ్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన మ్యాచ్ ద్వారా ఆయన ఈ చారిత్రాత్మక అరంగేట్రం చేశాడు. ఈ క్రమంలో పురుషుల క్రికెట్‌తో పాటు ఓవరాల్ జాతీయ రికార్డులను కూడా వైభవ్ తిరగరాశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యంత పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన పురుష ఆటగాడిగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 36 ఏళ్ల నాటి రికార్డును ఈ బీహార్ కుర్రాడు బద్దలు కొట్టడం విశేషం. అయితే, తన తొలి మ్యాచ్ లో వైభవ్ సాధారణ ఆరంభాన్ని మాత్రమే అందుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ రెండో టీ20 మ్యాచ్‌లో 10 బంతులు ఎదుర్కొన్న వైభవ్ 14 పరుగులు చేశాడు. ఈ చిన్న ఇన్నింగ్స్‌లో రెండు భారీ సిక్సర్లు బాది తన పవర్ ఏంటో చూపించినప్పటికీ, ఆ తర్వాత క్రీజ్ వదిలి ముందుకు వచ్చి షాట్ ఆడబోయి స్టంప్ అవుట్‌గా వెనుదిరిగాడు.భారత్ తరఫున టీ20ల్లో అరంగేట్రం చేసిన టాప్ 5 అత్యంత పిన్న వయస్కులు వీళ్లేభారత క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు అత్యంత తక్కువ వయసులోనే

# బంగారం, వెండి కాదు.. భవిష్యత్ అంతా ఈ లోహానిదే.

గత ఏడాది కాలంలో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. దీంతో వీటిల్లో పెట్టుబడి పెట్టినవారికి భారీగా లాభాలు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలు వెలువడుతు న్నాయి. 2035 నాటికి తులం బంగారం రూ.3 లక్షలకు చేరుకునే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో లాభాలు వస్తాయనే కారణంతో చాలామంది బంగారం, వెండిలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. గత ఏడాదిలో బంగారంపై 80 శాతం రిటర్నులు రాగా.. వెండిలో పెట్టుబడి పెట్టినవారికి 170 శాతం రిటర్న్స్ వచ్చాయి. అయితే బంగారం, వెండినే కాకుండా మరో లోహంలో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వచ్చే అవకాశముంది. అదేంటి అనేది ఇప్పుడు చూద్దాం.కాపర్‌లో పెట్టుబడి పెడితే లాభాలే.. లాభాలుగోల్డ్, సిల్వర్ తర్వాత కాపర్‌లో ఇన్వెస్ట్ చేస్తే భారీగా లాభాలు వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. మరో వెండి తరహాలో కాపర్ భవిష్యత్తులో అవ్వనుందని అంటున్నారు. కాపర్‌ను వెండితో పోల్చుతున్నారు. గడిచిన ఐదేళ్లల్లో కాపర్ ధర భారీగా పెరిగింది. ఏకంగా 113 శాతం వరకు పెరిగింది. రాబోయే కొన్నేళ్లల్లో కాపర్ కోసం దేశాల మధ్య పోటీ జరిగే అవకాశముందని,




రాబోయే రోజుల్లో అంత డిమాండ్ ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ కోసం దేశాల మధ్య పోటీ ఉన్నట్లుగానే.. భవిష్యత్తులో కాపర్ కోసం కూడా అలాంటి పోటీ ఉంటుందని చెబుతున్నారు. దీంతో కాపర్‌లో ఇప్పుడు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో భారీగా లాభాలు వస్తాయని అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈవీ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. ఎలక్ట్రిక్ కార్లలో కాపర్‌ను ఎక్కువగా వాడుతున్నారు. ఇక ఎలక్ట్రిక్ బస్సుల్లో కూడా దీనిని వాడుతున్నారు. దీంతో వీటి వినియోగం పెరుగుతోంది. ఇక ఇటీవల ఏఐ డేటా సెంటర్లలో కాపర్ వినియోగం భారీగా పెరిగింది. భవిష్యత్తులో మరిన్ని ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేసే అవకాశముంది. దీంతో కాపర్‌కు మరింత డిమాండ్ పెరగనుందని తెలుస్తోంది.

కాపర్‌లో పెట్టుబడి పెట్టడం ఎలా..?కాపర్‌లో పెట్టుబడి పెట్టడానికి అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. కాపర్ ఈటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. కాపర్ మైన్స్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టవచ్చు. ఇక యూఎస్ కాపర్ ఈటీఎఫ్‌లలో కూడా భారతీయులు పెట్టుబడి పెట్టే అవకాశముంది. ఇందుకోసం థర్డ్ పార్టీ యాప్స్, ఫ్లాట్ ఫామ్స్ లాంటివి చాలా ఉన్నాయి. సిప్ ప్రాతిపాదికన వీటిల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ప్రస్తుతం బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టినట్లుగానే కాపర్‌లో

PRGI NO: APTEL/26/A1204

హిందీ

# గద్వాల్ చేనేత చీరలో నాగ చైతన్య సతీమణి శోభిత



సినిమాలతో కెరీర్ ప్రారంభించిన శోభితది తెలుగు అమ్మాయే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మూలాలున్న శోభిత, విశాఖపట్నంలో పుట్టి పెరిగింది. చదువు పూర్తయ్యాక మోడల్ గా కెరీర్ ప్రారంభించింది. 2013లో 'ఫెమినా మిస్ ఇండియా ఎర్త్' కిరీటాన్ని గెల్చుకుని దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది శోభిత. ఆ తర్వాత బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తన అందం, అభినయంతో మంచి నటిగానూ గుర్తింపు తెచ్చుకుంది.2013లో 'ఫెమినా మిస్ ఇండియా ఎర్త్' కిరీటాన్ని గెల్చుకుని దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది శోభిత. ఆ తర్వాత బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తన అందం, అభినయంతో మంచి నటిగానూ గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో అడివి శేష్ హీరోగా వచ్చిన 'గూఢచారి' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది శోభిత. ఆ తర్వాత కూడా పలు సూపర్ హిట్ సినిమాలు, వెబ్ సిరీసుల్లో నటించి మెప్పించిందీ అందాల తార.తెలుగులో అడివి శేష్ హీరోగా వచ్చిన 'గూఢచారి' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది శోభిత. ఆ తర్వాత కూడా పలు సూపర్ హిట్ సినిమాలు, వెబ్ సిరీసుల్లో నటించి మెప్పించిందీ అందాల తార.ఇదే క్రమంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్యతో ప్రేమలో ఈ జంట రెండేళ్ల క్రితం ఒక్కటయ్యారు. 2024 డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో నాగ చైతన్య- శోభితల వివాహం అత్యంత వైభవంగా జరిగిందిఇదే క్రమంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్యతో ప్రేమలో పడింది శోభిత. చాలా ఏళ్ల పాటు ప్రేమలో మునిగి తేలిన ఈ జంట రెండేళ్ల క్రితం ఒక్కటయ్యారు. 2024 డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో నాగ చైతన్య- శోభితల వివాహం అత్యంత వైభవంగా జరిగింది కాగా పెళ్లి తర్వాత సినిమాలు బాగా తగ్గించేసిన శోభిత సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. తాజాగా శోభిత చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ ప్రత్యేక ఫోటోషూట్ లో పాల్గొంది. తెలంగాణకే తలమానికమైన 'గద్వాల్ చీర'ను ధరించి రాయల్ లుక్‌లో మెరిసిపోయింది.కాగా పెళ్లి తర్వాత సినిమాలు బాగా తగ్గించేసిన శోభిత సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. ప్రాముఖ్యతను చాటిచెబుతూ ప్రత్యేక ఫోటోషూట్ లో పాల్గొంది. తెలంగాణకే తలమానికమైన 'గద్వాల్ చీర'ను ధరించి రాయల్ లుక్‌లో మెరిసిపోయింది.

# ఆ హీరో అంటే నాకు పిచ్చి ఇష్టం



హీరోలు, హీరోయిన్స్ మాత్రమే కాదు క్యారెక్టర్ ఆర్టిస్ట్ లు కూడా మంచి క్రేజ్ తెచ్చుకుంటుంటారు. కొన్నిసార్లు హీరోయిన్స్ కంటే హీరోయిన్ ఫ్రెండ్ రోల్స్ చేసిన ముద్దుగుమ్మలు కూడా పాపులర్ అవుతుంటారు. వారిలో ధన్య బాలకృష్ణ ఒకరు. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అమ్మడు హీరోయిన్ గా సినిమాలు చేసింది అలాగే సహాయక పాత్రల్లోనూ నటించి అలరించింది. రాజా రాణి సినిమాలో నయనతార ఫ్రెండ్ గా చేసింది. అలాగే సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. రాజుగారి గాడి సినిమాలో హీరోయిన్ గా నటించి మెప్పించింది. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది ధన్య బాలకృష్ణ. ఇక ఇప్పుడు వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు పెద్దగా కనిపించడం లేదు. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాల్లో నటించిన ధన్య బాలకృష్ణ. ఎక్కువగా కోలీవుడ్ సినిమాల్లోనే కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఆమధ్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. అటు డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ అలరించింది. కానీ ఈ చిన్నది పెద్ద ఆఫర్స్ మాత్రం అందుకోలేకపోతుంది. అలాగే సోషల్ మీడియాలోనూ పంచుకుంటుంది.సినిమాలు మానేసి క్రైస్తవ మత ప్రచారకురాలుగా స్టార్ హీరోయిన్‌చిట్ చాట్ లో పాల్గొన్న ఆమె. హీరో సూర్య, బాలీవుడ్ లో రణ్‌బీర్ కపూర్ తన క్రష్‌లని.. ఉందని తెలిపింది. మరి ఈ ముద్దుగుమ్మకు ఆ ముగ్గురు హీరోలతో కలిసి నటించే ఛాన్స్ వస్తుందేమో చూడాలి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ధన్య రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ అభిమానులను కవ్విస్తుంది. ఈ ముద్దుగుమ్మ ఫోటోల పై మీరూ ఓ లుక్కేయండి.

# నాలుగేళ్లుగా వివాదం.. రియల్ స్టోరీతో మూవీ



ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సినిమా హాట్ టాపిక్ అయ్యింది. గత శుక్రవారం అంటే జూలై 3న ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5లో విడుదలైంది సట్లేజ్ అనే సినిమా. బాలీవుడ్ స్టార్ సింగర్ కమ్ హీరో దిల్జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని కేవలం రెండు రోజులకే ఓటీటీ నుంచి డిలీట్ చేశారు. ఇప్పుడు అదే విషయం సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ఇప్పటికే ఆ చిత్రాన్ని చూసిన అడియన్స్.. సగం కంటెంట్ చూసిన సినీ ప్రముఖులు ట్విట్టర్ వేదికగా సినిమా గురించి వరుస పోస్టులు చేస్తున్నారు. సట్లేజ్.. పంజాబ్ మానవ హక్కుల కారకర్త జస్వంత్ సింగ్ ఖాల్రా రియల్ స్టోరీతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జస్వంత్ ఖాల్రా.. 1990లలో పంజాబ్ లో అదృశ్యమైన పలువురు వ్యక్తుల కేసులపై ఆయన పరిశోధనలు చేసి కీలక ఆధారాలు బయటపెట్టారు. అదే సమయంలో 1995లో ఆయనను హత్య చేశారు. దీంతో అప్పట్లో పంజాబ్ లో ఎన్నో అలర్లు జరిగాయి. ఈ వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని దిల్?జిత్ హీరోగా, దర్శకుడు హనీ ట్రెహన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.అయితే ఈ సినిమాకు మొదట ఘల్లుఘరా అనే టైటిల్ ఫిక్స్ చేశారు. తర్వాత పంజాబ్ 95 అనే టైటిల్ ఎంపిక చఉండదని.. నిర్మాతలు కోర్టును ఆశ్రయించారు. దీంతో గత నాలుగేళ్లుగా సినిమా విడుదల వాయిదా పడుతూనే వచ్చింది. జూలై 3న జీ5 ఓటీటీలో రిలీజ్ చేశారు.కానీ సడెన్ గా

# ప్రభాస్‌కు ఇష్టమైన హీరోయిన్ ఎవరో తెలుసా.



రెబల్ స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. డార్లింగ్ లైనప్ చూస్తే మెంటలెక్కుతుంది. గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ ఫ్యాన్స్ కు అదిరిపోయే ఎంటర్టైన్మెంట్ అందిస్తున్నాడు ప్రభాస్. చివరిగా ప్రభాస్ నటించిన రాజా సాబ్ సినిమా ఆకట్టుకోలేకపోయింది. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అభిమానుల అంచనాలు అందుకోలేకపోయింది. దాంతో డార్లింగ్ నెక్ట్స్ సినిమా కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా , హనురాఘవపుడి డైరెక్షన్లో ఫౌజి, అలాగే ప్రశాంత్ నీల్ సలార్2, నాగ్ అశ్విన్ కల్కి2 ఇలా చాలా సినిమాలు ప్రభాస్ పూర్తి చేయాల్సి ఉంది. సినిమాల సంగతి పక్కన పెడితే.. ప్రస్తుతం ప్రభాస్ కు సంబంధించిన ఒక విషయం నెట్టింట బాగా వైరలవుతోంది. ప్రభాస్ అభిమాన హీరోయిన్ ఎవరో తెలుసా.? ప్రభాస్ ఓ ఇంటర్వ్యూలో ఓ హీరోయిన్ అంటే తనకు క్రష్ అని తెలిపాడు. ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా , హనురాఘవపుడి డైరెక్షన్లో ఫౌజి, అలాగే ప్రశాంత్ నీల్ సలార్2, నాగ్ అశ్విన్ కల్కి2 ఇలా చాలా సినిమాలు ప్రభాస్ పూర్తి ప్రస్తుతం ప్రభాస్ కు సంబంధించిన ఒక విషయం నెట్టింట బాగా వైరలవుతోంది. ప్రభాస్ అభిమాన హీరోయిన్ ఎవరో తెలుసా.? ప్రభాస్ ఓ ఇంటర్వ్యూలో ఓ హీరోయిన్ అంటే తనకు క్రష్ అని తెలిపాడు. బాలీవుడ్ లో ఆమె స్టార్ హీరోయిన్.. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు ఆమె. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె బాలకృష్ణతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. అలాగే కింగ్ నాగార్జునతో కూడా నటించింది.. ఇంతకూ ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్. తెలుగులో పలు హిట్ చిత్రాల్లో నటించి అభిమానులకు బాగా దగ్గరైన ఉత్తరాది భామ రవీనా టాండన్ గురించి టాలీవుడ్ అగ్రహీరో ప్రభాస్ గతంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# ప్రభాస్ మళ్లీ మళ్లీ వినే రెండు పాటలు ఇవే..



కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలతో టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ వెంకటేష్ మహా. సినిమాలపై ఉన్న కసితో 'బద్రీనాథ్', 'తీన్మార్' వంటి చిత్రాలకు సెట్ బాయ్‌గా, జూనియర్ ఆర్టిస్ట్‌గా చిన్న చిన్న పనులు చేస్తూ తన కెరీర్‌ను ప్రారంభించిన ఆయన.. ప్రస్తుతం దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. వెంకటేష్ మహా సినిమాల్లో సహజత్వం ఎక్కువగా ఉంటుంది. లార్జర్ దాన్ లైఫ్ క్యారెక్టర్లు కాకుండా, మన పక్కింట్లో ఉండే వ్యక్తుల లాంటి పాత్రలనే ఆయన ఎంచుకుంటారు. ఇటీవల ఆయన ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ ప్రయాణం, తన సినిమాల్లోని హిట్ సాంగ్స్‌పై టాలీవుడ్ టాప్ స్టార్స్ చూపించిన ప్రేమాభిమానాల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. వెంకటేష్ మహా దర్శకత్వం వహించిన 'కేరాఫ్ కంచరపాలెం' చిత్రంలోని "ఆశా పాశం" పాట ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ పాట గురించి మాట్లాడుతూ ఆయన ఎంతో గర్వపడ్డారు. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ ఒక బాలీవుడ్ ఇంటర్వ్యూలో ఈ పాట లిరిక్స్ పాడటంపై వెంకటేష్ మహా స్పందిస్తూ.. "ఎన్టీఆర్ లాంటి ఒక పెద్ద స్టార్‌ను ఆ పాట అంతలా కదిలించిందంటే, ఆయన ఎంతటి గొప్ప మనసున్న మనిషో అర్థమవుతుంది" అని ఆనందం వ్యక్తం చేశారు.అంతేకాకుండా, రెబల్ స్టార్ ప్రభాస్ కూడా ఈ పాటను ఎంతో ఇష్టపడతారని మహా రివీల్ చేశారు. ఒకసారి ప్రభాస్ ఆఫీస్ నుండి తనకు ఫోన్ వచ్చిందని, ప్రభాస్ నిత్యం "ఆశా పాశం", "నింగి చుట్టే" పాటలను లూప్‌లో వింటుంటారని ఆయన టీమ్ చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను విజయవాడ, ఒరిస్సా పర్యటనల్లో బిజీగా ఉండటం వల్ల ప్రభాస్‌ను కలవలేకపోయానని, అంతటి పెద్ద స్టార్స్ స్క్రీన్ పైనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఎంతో అద్భుతమైన హ్యూమన్ బీయింగ్స్ అని అన్నారు. తొలత తాను 'కేరాఫ్ కంచరపాలెం' గ్రామంలో ఉన్నవారితో ఒక పిచ్ వీడియో చేశానని, దానికి 'రంగస్థలం' అనే టైటిల్ అనుకున్నట్లు మహా తెలిపారు. అయితే అదే సమయంలో సుకుమార్ -- రామ్ చరణ్ కాంబినేషన్‌లో 'రంగస్థలం' టైటిల్ అనౌన్స్ అవ్వడంతో కాస్త ఆశ్చర్యపోయినా, తన ఫేవరెట్ టైటిల్ ఒక సీనియర్ డైరెక్టర్ సినిమాకు వెళ్లడం, దానికి సరైన న్యాయం జరగడం

# ఎంటర్‌టైన్మెంట్ అద్దిరిపోద్ది



మరో వారం వచ్చేసింది. ఈ వీకెండ్ లో నాగ బంధం, రావు బహదూర్ వంటి ఆసక్తికరమైన సినిమాలు థియేటర్లలో రిలీజ్ కానున్నాయి. ఇప్పటివరకు ఈ సినిమాల నుంచి రిలీజైన కంటెంట్ చూస్తుంటే రెండు చాలా డిఫరెంట్ మూవీస్ గా ఉండనున్నాయని తెలుస్తోంది. వీటితో పాటు ఆర్ ఆర్ఆర్ బ్యూటీ ఆలియా భట్ ప్రధాన పాత్ర లో నటించిన అల్ట్రా స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ 'ఆల్ఫా' కూడా ఈ వారంలోనూ థియేటర్లలో సందడి చేయనుంది. మరోవైపు ఓటీటీల్లో మాత్రం 15కి పైగా కొత్త సినిమాలు, వెబ్ సిరీసులు స్ట్రీమింగ్ కు రానున్నాయి. ముఖ్యంగా ఇప్పుడు ఓటీటీ ఆడియెన్స్ దృష్టి మొత్తం 'అబ్సెషన్' మూవీ పైనే ఉంది. వరల్డ్ బాక్సాఫీస్ ను షేక్ చేసిన ఈ సినిమాతో పాటు రామ్ చరణ్ బ్లాక్ బస్టర్ మూవీ 'పెద్ది' కూడా ఈ వారంలోనే డిజిటల్ రిలీజ్ అంటున్నారు. కానీ దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు మాలీవుడ్ టైమ్స్ లాంటి డబ్బింగ్ చిత్రం కూడా స్ట్రీమింగ్ కానుంది. అయితే సందీప్ కిషన్ 'సూపర్ సుబ్బు', ఐశ్వర్య రాజేశ్ 'ఇసకపట్నం' లాంటి వెబ్ సిరీస్ లు కూడా ఆసక్తి కలిగిస్తున్నాయి. మొత్తానికి ఈ వారం థియేటర్లు- ఓటీటీ సినిమాలతో ఆడియెన్స్ కు మంచి ఎంటర్ టైన్మెంట్ అందనుందని చెప్పవచ్చు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.